
## ఏడాదిలోనే తనదైన ముద్ర..

సీనియర్ ఐపీఎస్ అధికారులైన కల్మేశ్వర్ సింగెనవార్, రోహిణి ప్రియదర్శిని 2012 బ్యాచ్‌కు చెందిన పోలీస్ అధికారులు. దంపతులిద్దరికీ ముక్కుసూటి వ్యక్తులుగా పేరుంది. రాజీ లేకుండా పనిచేస్తారన్న గుర్తింపు కూడా ఉంది. అసెంబ్లీ ఎన్నికల వేళ అప్పటి సీపీ వి.సత్యనారాయణ ఈసీ ఆదేశాలతో 2023 అక్టోబర్ 11న బదిలీ కాగా, ఆయన స్థానంలో కల్మేశ్వర్ సింగెనవార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన భార్య రోహిణి ప్రియదర్శిని మూడు నెలల క్రితమే 7వ బెటాలియన్ కమాండెంట్‌గా వచ్చారు. ఏడాది కాలంలోనే సీపీగా కల్మేశ్వర్ సింగెనవార్ తనదైన ముద్ర వేసుకున్నారు. ఇంటిని చక్కబెట్టి సమాజాన్ని మార్చాలన్న సూక్తిని పాటించారు. అందులో భాగంగా తప్పు చేసిన పోలీసులను శిక్షించారు. ఆ తర్వాత అసాంఘిక శక్తుల పీచమణిచేందుకు నడుం బిగించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిని, పేకాట రాయుళ్లను, వ్యభిచారం, గంజాయి అమ్మకం, ఇతర అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపారు. రాత్రి పదిన్నర గంటల తర్వాత నడిచే దుకాణాల మూసివేతకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఒక దశలో సాదాసీదా వ్యక్తిగా విజిట్ చేసి అక్రమార్కులను దండించి దారిలోకి తెచ్చారు. రాజకీయ నేతలతో అంటకాగిన పోలీసులకు చుక్కలు చూపించారు. మాట వినని పోలీసులను ఇంటికి పంపించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పని చేసిన విష్ణుమూర్తి ఆగడాలపై నమస్తే తెలంగాణ ప్రచురించిన కథనంపై సీపీ తీవ్రంగా స్పందించారు. టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని ప్రక్షాళన చేశారు. ఏసీపీని డీజీపీకి అటాచ్ చేయడం, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్, పలువురిని బదిలీ చేసి అక్రమార్కులను దారిలోకి తెచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణలో విశేష కృషి చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గలేదు. మిస్సింగ్ కేసుల ఛేదనలోనూ ప్రతిభను చూపించారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీలో జిల్లాను ముందుకు వరుసలో నిలిపారు.




# ఖాకీ ఓడింది.. ఖద్దరు గెలిచింది





## పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ బదిలీ

- ఫలించిన అధికార కాంగ్రెస్ లీడర్ల ఒత్తిడి
- నిజాయితీగా పని చేసిన సింగెనవార్
- ఇంటా, బయటా అక్రమాలకు కళ్లెం వేసిన కమిషనర్
- అధికార పార్టీ నేతలకు కొరక రాని కొయ్యగా మారిన వైనం
- సీపీని పంపించాలని పట్టుబట్టిన కాంగ్రెస్ నేతలు
- కేంద్ర సర్వీసులకు కల్మేశ్వర్ దంపతులు..
- నేషనల్ పోలీస్ అకాడమీ అదనపు డైరెక్టర్లుగా నియామకం
- బదిలీ వ్యవహారాన్ని ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'

నిజామాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీ నేతల దెబ్బకు 'ఖాకీ' డ్రెస్సు ఓడింది. ఖద్దరు రాజకీయమే గెలిచింది. నిజాయితీగా పని చేసిన అధికారికి ప్రభుత్వం బదిలీని బహుమతిగా ఇచ్చింది. ఏడాదిన్నర కాలంగా జిల్లాలో అక్రమ వ్యవహారాలకు అడ్డుకట్ట వేసిన సీపీ కల్మేశ్వర్ సింగెనవార్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే, ఆయన భార్య, ఏడో బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శినిని సైతం ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర సర్వీసులకు వెళ్తున్న సీపీ దంపతులకు హైదరాబాద్‌లోని జాతీయ పోలీసు అకాడమీ (ఎన్‌పీఏ)లో అడిషనల్ డైరెక్టర్లుగా పోస్టింగ్‌లు దక్కాయి.

### పంతం నెగ్గించుకున్న ఖద్దరు..

అయితే, సీపీ నిజాయతీ చర్యలు అధికార పార్టీ నేతలకు కంటగింపుగా మారాయి. తమ మాట చెల్లుబాటు కావడం లేదని ఆ పార్టీ నేతలు ఆగ్రహంతో ఊగిపోయారు. ఈ క్రమంలోనే కొత్తగా గెలిచిన ఓ ఎమ్మెల్యేకు, సీపీకి మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు వచ్చాయి. బహిరంగంగానే ఇరువురి మధ్య పోరు నడిచింది. బదిలీలు, పోస్టింగ్ విషయాల్లో ఇదంతా ప్రస్ఫుటమైంది. మరోవైపు, మోపాల్‌లో ట్రాక్టర్ల ర్యాలీపై ఆంక్షలతో ఖాకీ, ఖద్దరు మధ్య పోరు విషయం బాహ్య ప్రపంచానికి తెలిసి పోయింది. సీపీ తీరుతో కోపోద్రిక్తుడైన సదరు ఎమ్మెల్యే ఎలాగైనా బదిలీ చేయాల్సిందేనంటూ ప్రభుత్వ పెద్దలను వేడుకోగా, అదే పార్టీకి చెందిన కొంత మంది మాత్రం సీపీకి మద్దతుగా నిలుస్తూ వచ్చారు. అయితే, ఇక్కడి పోరు పడలేక సీపీ దంపతులు స్వచ్ఛందంగా కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఫలితంగా ఎమ్మెల్యే పంతం నెగ్గినట్లయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి రోజే సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎవ్వరినీ వదిలి పెట్టొద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వాటిని అమలు చేసిన పోలీస్ అధికారులను మాత్రం అధికార నేతలే బదిలీ చేసేదాకా పట్టుబట్టి పంతం నెగ్గించుకోవడం చర్చనీయాంశమైంది.

### ముందే చెప్పిన 'నమస్తే'..

సీపీ వచ్చినప్పటి నుంచి కల్మేశ్వర్ సింగెనవార్ అక్రమాలకు తావులేకుండా పని చేశారు. తప్పు చేసిన వారిని ఏమాత్రం ఉపేక్షించలేదు. బదిలీలు, ప్రమోషన్ల విషయంలో పైరవీలను సైతం పక్కన పడేశారు. ఈ క్రమంలోనే ఆయన అధికార పార్టీ నేతలకు కొరక రాని కొయ్యగా మారారు. దీంతో ఆయనను తప్పించాలని కొంతమంది నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో సీపీని ఇక్కడి నుంచి పంపించేందుకు పావులు కదుపుతున్న విషయాన్ని 'నమస్తే తెలంగాణ' ముందుగానే చెప్పింది. కల్మేశ్వర్‌ను కదిలిస్తున్నారనే అంశాన్ని ఎత్తిచూపుతూ అక్టోబర్ 1న 'సీపీ సీటుకు ఎసరు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఇది జరిగి సరిగ్గా మూడు వారాలు కూడా కాక ముందే సీపీకి స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.


సీపీ సీటుకు ఎసరు?

# టీయూ వీసీగా యాదగిరి రావు



- ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్
- రెగ్యులర్ వీసీ నియామకంపై హర్షాతిరేకాలు

డిచ్‌పల్లి, అక్టోబర్ 18: ఎట్టకేలకు తెలంగాణ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీ రానున్నారు. శుక్రవారం రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలకు వీసీలను నియమించగా.. తెలంగాణ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ డాక్టర్ టి. యాదగిరిరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉత్తర్వులు జారీ చేశారు. వీసీ పదవీకాలం ఈ ఏడాది మే 22 నాటికి ముగియడంతో సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ సుల్తానియా ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతున్నారు. ఐదు నెలల తర్వాత టీయూకు రెగ్యులర్ వీసీని నియమించడంపై అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### యాదగిరి రావు నేపథ్యం

యాదగిరి రావు ప్రస్తుతం వరంగల్ జిల్లా కాకతీయ యూనివర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. కేయూ దూరవిద్యాకేంద్రంలో తొలి ఉద్యోగి. 2004 లో కేయూ లో అధ్యాపకుడిగా చేరారు. అనంతరం 2010 లో ప్రొఫెసర్‌గా ప్రమోషన్ పొందారు. కేయూలో యూజీసీ కో-ఆర్డినేటర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి, బీవోఎస్ చైర్మన్‌గా పలు అకడమిక్ పదవులు నిర్వహించారు. యాదగిరిరావు గతంలో తెలంగాణ యూనివర్సిటీ సోషల్ సైన్స్ డీన్‌గా రెండున్నరేండ్ల పాటు పని చేశారు. ఆయనకు లోతైన పరిశోధన అనుభవమున్నది. ఇతని పర్యవేక్షణలో 15 మంది పీహెచ్‌డీ, ఏడుగురు ఎంఫిల్ పూర్తి చేశారు. 16 అంతర్జాతీయ స్థాయి సదస్సులతో పాటు 27 జాతీయ స్థాయి సెమినార్లకు హాజరై పత్ర సమర్పణ చేశా రు. 2021లో తెలంగాణ ప్రభు త్వం ఉత్తమ అధ్యాపక అవార్డుతో గౌరవించింది. ఇప్పటివరకు ఆయన అమెరికా, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, సింగాపూర్, ఇండోనేషియా దేశాలను సందర్శించారు.

### వీసీ బయోడేటా

డాక్టర్ టి.యాదగిరి రావు
**జననం:** 26.01.1965
**చదువు:** ఎంఏ, పీహెచ్‌డీ
**చిరునామా :** టీచర్స్ కాలనీ, సుబేదారి, వడ్డెపల్లి, హన్మకొండ
**ప్రస్తుతం:** వరంగల్ కాకతీయ యూనివర్సిటీలోని సీనియర్ ప్రొఫెసర్‌గా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెడ్‌గా పనిచేస్తున్నారు.
**బోధన, రీసెర్చ్ అనుభవం:** 28 ఏండ్లు
**సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు :** అంతర్జాతీయ స్థాయిలో 16, జాతీయ స్థాయిలో 27
**రాసిన పుస్తకాలు :** పది
**ప్రచురణలు :** అంతర్జాతీయ స్థాయిలో 21, జాతీయ స్థాయిలో 28
**అవార్డులు :** 2021లో రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు


# ఏటీసీల్లో నెలాఖరులోపు ప్రవేశాలకు అవకాశం


వీసీలో పాల్గొన్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


కామారెడ్డిలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

- అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో 'ఉపాధి'కోర్సులు
- ఏటీసీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- అధికారుల సమావేశంలో నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్ల దిశానిర్దేశం

కంఠేశ్వర్/ కామారెడ్డి రూరల్, అక్టోబర్ 18 : యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు)ల్లో నెలాఖరులోపు ప్రవేశాలు ముగిసేలా అధికారులు చొరవ తీసుకోవాలని నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, ఆశీష్ సంగ్వాన్ సూచించారు. ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఏటీసీల్లో ప్రవేశాలకు సంబంధించిన ప్రగతిపై ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వా రా సమీక్షించారు. వీసీ అనంతరం రెండు జిల్లాల కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, ఆశీష్ సంగ్వాన్ వేర్వేరుగా సంబంధిత అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. నిజామాబాద్‌లో కలెక్టర్ మాట్లాడుతూ..ఏటీసీల్లో ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయాలని, వీటిపై అవగాహన పెంపొందించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఏటీసీలో శిక్షణ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. తొలి విడుతగా నిజామాబాద్, బోధన్, కమ్మర్‌పల్లిలో కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఏటీసీని కొనసాగిస్తూ ఆయా కోర్సుల్లో శిక్షణను ప్రారంభిస్తామన్నారు. ఈ సెంటర్లలో కోర్సులను పూర్తి చేసుకున్న వారికి వారి సామర్థ్యాన్ని బట్టి వివిధ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు ప్రభుత్వరంగ సంస్థల్లోనూ ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31లోపు ప్రవేశాలు పొందాలని ఆయన సూచించారు.



ఉప్లూర్‌లో సోయా కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఏఎంసీ, సొసైటీ చైర్మన్లు

## స్పందించారు.. కొనుగోళ్లు ప్రారంభించారు..

### మోర్తాడ్, ఉప్లూర్, చందూర్‌లో ధాన్యం సేకరణ

మోర్తాడ్, చందూర్, అక్టోబర్ 18: అధికారులు ఎట్టకేలకు వరి, సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో సోయా, వరి కొనుగోలు కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికే ఆర్భాటంగా ప్రారంభించినా, ఎక్కడా కాంటా వేసిందిలేదు. చందూరు, మోర్తాడ్ , కమ్మర్‌పల్లి తదితర ప్రాంతాల్లో వరి, సోయా కోతలు జోరుగా సాగుతున్నాయి. కోతలు తుది దశకు చేరుకున్నా కొనుగోలు కేంద్రాల జాడ కనిపించలేదు. కమ్మర్‌పల్లిలో ఈ నెల 10న సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభించినా ఒక్క గింజా కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'జాడలేని కేంద్రాలు..ధాన్యం దళారుల పాలు' శీర్షికన ఈ నెల 17న ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. శుక్రవారం మోర్తాడ్, ఉప్లూర్‌తోపాటు చందూర్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. చందూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబు ప్రారంభించగా.. ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, తహసీల్దార్ శాంత, ఎంపీడీవో నీలావతి తదితరులు పాల్గొన్నారు.

### కమ్మర్‌పల్లి, ఉప్లూర్‌లో సోయా కొనుగోళ్లు

కమ్మర్‌పల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేస్తున్నామని కార్యదర్శి శంకర్ తెలిపారు. కొనుగోలు చేసిన సోయాలను తిప్పి పంపితే కూలీల ఖర్చు, రవాణా ఖర్చు రైతులే భరించాలని చెప్పడంతో రైతులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. కమ్మర్‌పల్లి సొసైటీ పరిధిలోని ఉప్లూర్‌లోనూ సోయా కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్ ప్రారంభించారు.

## వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవద్దు

- కాచాపూర్, బస్వాపూర్ పీఏసీఎస్‌లకు హైకోర్టు ఆదేశం
- పర్సన్ ఇన్‌చార్జీల నియామకంపై వాడివేడిగా విచారణ
- సోమవారానికి వాయిదా వేసిన ఉన్నత న్యాయస్థానం

భిక్కనూర్, అక్టోబర్ 18: భిక్కనూర్ మండలంలోని బస్వాపూర్, కాచాపూర్ పీఏసీఎస్‌లలో తాజాగా వెలుగు చూసిన అనైతిక వ్యవహారంపై హైకోర్టులో వాడివేడిగా విచారణ జరిగింది. సహకార చట్టంలో లేని నిబంధనలను ఆపాదించి ప్రభుత్వ ఆదేశాలను బూచీగా చూపించి పర్సన్ ఇన్‌చార్జీలను నియమించడంపై పలువురు డైరెక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగం ప్రసాదించిన ఆర్టికల్ 14, 16 ఉల్లంఘనలను ప్రస్తావిస్తూ న్యాయం చేయాలని ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. సహకార చట్టం 1964లోని సెక్షన్ 15 ప్రకారం విభజించబడిన రెండు సొసైటీల తీరుతెన్నులపై కూలంకషంగా అధ్యయనం చేసింది. పర్సన్ ఇన్‌చార్జీల నియామకంపై పిటిషనర్లు పలు కీలక అభ్యంతరాలను హైకోర్టు ముందు లేవనెత్తగా, న్యాయస్థానం ప్రభుత్వ న్యాయవాది వివరణ కోరింది. చట్ట ఉల్లంఘనలు జరిగి ఉంటే సహించేది లేదని ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యానించినట్లు పిటిషనర్ల తరపు న్యాయవాదులు చెప్పారు. ఏ ప్రాతిపదికన పర్సన్ ఇన్‌చార్జీలను నియమించారో వివరణ ఇవ్వాలంటూ హైకోర్టు ప్రశ్నించింది. ఇందుకు అనుకూలించిన నిబంధనలపై ప్రభుత్వ న్యాయవాదిని వివరణ కోరింది. కామారెడ్డి జిల్లా సహకార శాఖ అధికారి జారీ చేసిన ఉత్తర్వులు చెల్లుబాటు కాకుండా చూడాలని పిటిషనర్లు కోరగా, తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకూ బస్వాపూర్, కాచాపూర్ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జీలు మల్లారెడ్డి, కిష్టాగౌడ్‌లు ఎలాంటి కీలక, వివాదాస్పద నిర్ణయాలూ తీసుకోరాదంటూ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సోమవారం మరోసారి ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని వెల్లడించింది.



## కందకుర్తిలో తాగునీటి కటకట..

### జీపీ కార్యదర్శి నిలదీత


కందకుర్తి జీపీలో ఇన్‌చార్జి కార్యదర్శితో గ్రామస్తుల వాగ్వాదం

రెంజల్, అక్టోబర్ 18: మండలంలోని కందకుర్తిలో తాగునీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదేండ్ల నుంచి తమకు నీటి కష్టాలు లేవని, ఇటీవల తాగునీటి ఎద్దడి నెలకొందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నెలరోజులవుతున్నది. నెలరోజులవుతున్నా మరమ్మతులు చేయించకపోవడంతో గ్రామస్తులు శుక్రవారం పంచాయతీ కార్యాలయానికి చేరుకొని ఇన్‌చార్జి కార్యదర్శి రాజేందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుట్ట మీది కాలనీవాసుల దాహార్తి తీర్చే తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నెలరోజులవుతున్నా ఎందుకు మరమ్మతులు చేయడంలేదని ప్రశ్నించారు. కొన్ని కాలనీల్లో పైపులైన్లు ధ్వంసమై లీకేజీలు ఏర్పడినా పట్టించుకోవడంలేదన్నారు. తాగునీరు కలుషితమై రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కారోబార్ సాజిద్‌బేగ్ నిర్లక్ష్యంతో తాగునీటి సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదని ఆరోపించారు. స్థానిక నాయకులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. రెండురోజుల్లో లీకేజీలకు మరమ్మతులు చేపడుతామని ఎంపీవో, గ్రామ ప్రత్యేకాధికారి రఫియోద్దీన్ గ్రామస్తులకు సర్దిచెప్పారు.

## కేసీఆర్ అడిగినన్ని 'డబుల్ ఇండ్లు' ఇచ్చిండు

### ఎమ్మెల్యే పోచారం


కోటగిరిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ/పోతంగల్(కోటగిరి) అక్టోబర్ 18: గత ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ బాన్సువాడ నియోజకవర్గానికి అడిగినన్ని డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన సహకారంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. శుక్రవారం ఆయన బాన్సువాడపట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బీర్కూర్ మండలంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్లకు సంబంధించిన పట్టాలను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి అందజేశారు. కోటగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పోచారం మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేయడంలో మాజీ సీఎం కేసీఆర్ సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఒక్కో నియోజకవర్గానికి 1400 ఇండ్లు మంజూరు చేస్తే, కేసీఆర్ బాన్సువాడ నియోజకవర్గానికి విడుతల వారీగా 11 వేల ఇండ్లను ఇచ్చారని గుర్తుచేశారు. ఇందులో నాలుగువేల ఇండ్లను మాత్రమే నిర్మించి ఇచ్చామని, మిగితా ఏడువేల ఇండ్లను లబ్ధిదారులు వారి సొంత స్థలాల్లో కట్టుకునేవారికి మంజూరు చేసినట్లు తెలిపారు.